

హత్య కేసులో పదేళ్ల కారాగార శిక్ష

ప్రొద్దుటూరు: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడేళ్ల కిందట జరిగిన హత్య కేసులో ముద్దాయి సిరివెళ్ల దొరస్వామికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50వేల జరిమానాను రెండవ జిల్లా అదనపు కోర్డు జడ్జి శుక్రవారం తీర్పునిచ్చారు. సాక్ష్యాధారాలతో శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను ఎస్పి సిద్ధార్థకౌశల్ అభినందించారు. వివరాలు.. 2017 జూన్ 23న మద్యం మత్తులో తన భార్యను తిట్టూ కొట్టుండగా ఆమె చిన్నాన్న శ్రీనివాసనగర్‌కు చెందిన గుండాల సుధాకర్‌కు సమాచారం ఇచ్చింది. దీంతో ఆయన వచ్చి దొరస్వామిని మందలించాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి చివరకు కత్తితీసుకొని సుధాకర్‌ను దొరస్వామి పొడిచాడు. బాధితుడు చికిత్స పొందుతూ 2017జూన్ 27న మరణించాడు. అప్పటి అర్బన్ సి.ఐ. సదాసివయ్య కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేసి ఛార్జి షీట్ దాఖలు చేశారు. రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ జరిగి ముదాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - చాపాడు

అసమానతలు లేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా రక్షణభేరి బస్సు జాతాను, బహిరంగసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా 30న కర్నూల్ జిల్లా నుంచి బయలు దేరినబస్సుజాతా 31న సాయంత్రం మైదుకూరు,1న ఉదయం బద్వేల్, మధ్యాహ్నం కడపకు చేరుకుంటుందన్నారు. ఈసందర్భంగా నిర్వహించే బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. దేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయని ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తున్నా ప్రత్యేక హోదా పోలవరం ప్రాజెక్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ లాంటి విభజన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రజల ఆస్తులన్నీ ఆదాని,అంబానీ లకు దోచిపెడుతుందన్నారు. మోటర్లకు మీటర్లు పేర్లతో ఆస్తి పన్ను నుంచి చెత్త పన్ను వరకు అనేక భారాలు మోపుతుందన్నారు. ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని వాపోయారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు.వి.అన్వేష్, కె.సత్యం బి.మఠం మండల కార్యదర్శి గోవింద్, ఖాజీపేట సీనియర్ నాయకులు, వెంకటసుబ్బయ్య, గురయ్య, రాహుల్, లక్ష్మయ్య, బాలరాజు, సుధాకర్, పోలయ్య, తామస్, ఇమామ్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నవంబర్ 1న జరిగే ప్రజారక్షణ భేరీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, పి.చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు డి.ఎం. ఓబులేసు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలో వివిధ ఆటో స్టాండ్‌ల వద్ద కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30వ తేదీ నుంచి మూడు ప్రాంతాల నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కడపకు నవంబర్ ఒకటో తేదీన చేరుకుంటుందని తెలిపారు. పాత బస్టాండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన హామీల అమలు కోసం, నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం, కడప ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రయివేటుకరణను ఆపాలని, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్‌తో యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆటో కార్మికుల పొట్ట కొట్టే నూతన మోటార్ వెహికల్ యాక్ట్ తీసుకొచ్చారని వారు వాపోయారు. తక్షణమే ఆ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు ఎండగడుతూ ప్రజలలో చైతన్యవంతులు చేయడం కోసం, వారి హక్కుల సాధన కోసం జరుగుతున్న ప్రజారక్షణ భేరీ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇమామ్, ఉదయ్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ విజయరామరాజు

స్థానిక సమస్యలకు స్థానికంగానే పరిష్కారం అందించేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి హాజరై ప్రజల తరపున సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారికి ఇది మంచి అవకాశం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం అత్యంత ప్రాధాన్యతతో కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామ స్థాయి సమస్యలు, మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించే దిశగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 'జగనన్నకు చెబుదాం' ద్వారా అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజల అర్జీలకు అధికారులు అందించే పరిష్కార నివేదికలు కూడా స్పష్టంగా ఉండాలని ఇందులో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన క్షేత్ర స్థాయిలో ఎలా ఉంటుందో ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఇక్కడికే వచ్చి ప్రజల ఫిర్యాదులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం అని ప్రశంసించారు. స్థానికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జమ్మలమడుగు ప్రెస్ క్లబ్ తరఫున ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ప్రెస్ క్లబ్ కోసం స్థలం జమ్మలమడుగు విలేకరులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రతి విలేకరికి మూడు సెంట్లు స్థలం రోడ్డుకు అనువైన ప్రదేశంలో ఇవ్వాలని అధికారులకు సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు ఏజెంట్లు న్యాయం చేయాలని పెద్దముడియంలో అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నియోజ కవర్గ స్థాయి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత నీటి పరిష్కారం చూపాలి : సర్పంచ్

గండికోట గ్రామానికి శాశ్వత నీటి పరిష్కారం చూపాలని సర్పంచ్ కామాటి గురు ఈశ్వర్ కలెక్టర్ విజయరామరాజును కోరారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. గండికోటకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉండడం వల్ల సాగునీటికి అధికంగా సమస్య ఉందన్నారు. శ్మశాన వాటిక ఉన్నప్పటికీ వాటికి పట్టా లేకపోవడం వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు ఏర్పడే ప్రమాదమున్నందని ఆ స్థలానికి పట్టాను మంజూరు చేయాలని తెలిపారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇందిరమ్మ కాలనీల్లో సిసి రోడ్లను మంజూరు చేయాలని, గ్రామం మొత్తం విద్యుత్ స్తంభాలు పాడైపోయి ప్రమాదకరంగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విన్నవించారు. గూడెం చెరువు నుంచి గండికోటకు ఫోర్ లైన్ రోడ్డును, గూడెం చెరువు నుంచి దప్పెళ్ళలోని బోటింగ్ ప్రదేశం వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద్, శ్రీను, గురు మోహన్, గురప్ప పాల్గొన్నారు.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు : జెసి

ప్రజాశక్తి - కడప

రహదారుల భద్రత కోసం అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జెసి జి.గణేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇటీవలి కాలంలో కడప-నెల్లూరు ప్రధాన రహదారిలో చోటు చేసుకున్న భారీ రోడ్డు ప్రమాదం పలు కుటుంబాలలో విషాదాన్ని నింపిందని చెప్పారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని, మలుపుల వద్ద బారికేడ్లను స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించడం, లాంగ్ డ్రైవ్‌లో వచ్చే డ్రైవర్లకు అక్కడక్కడ రెస్ట్ ఏరియాలు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. జిల్లాలో ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, బస్సులు, ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. యువతకు వాహనాలను కొనిచ్చే తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాధ్యతలను గుర్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రోడ్డు భద్రతా సమన్వయ కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ. మహేశ్వర్ రెడ్డి, ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, పీఆర్, విద్యుత్ శాఖల ఎస్ఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హై వేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, జిల్లా కో-ఆర్డినేటర్, రోడ్డు భద్రత ఎన్‌జిఒలఅధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కమలాపురం : జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని జిల్లా ప్రజా ప్రతినిధులు ఉన్న తాధికారులు పల్లెబాట పట్టాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం మండలం జి అప్పయపల్లె నల్లింగాయపల్లె గ్రామాలలో ఎండిపోయిన మినుము ,కంది పత్తి ,పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ విపత్తుతో వేసిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయని సన్న ,చిన్న కారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కరువు కోరల్లో కడప జిల్లా చిక్కుకుందని రైతులకు భరోసా ఇచ్చే విధంగా జిల్లా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు గ్రామాలలో పర్యటించాలని ఆయన కోరారు. ఎండి పోయిన పంటలకు తక్షణమే ఇ క్రాప్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వలసల నివారణకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. కరువు సహాయక చర్యలు చేపట్టకపోతే రానున్న కాలంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పంట నష్టపోయిన బాధితులు కోటేశ్వర్ రెడ్డి పెంచలయ్య వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

50 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కడప అర్బన్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీరెడ్డి

తెలుగుదేశం పార్టీలో చేరిన కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, మన్మోహన్ రెడ్డి తెలిపారు. 38వ డివిజన్‌లో ఇన్‌ఛార్జి ఆదిల్ ఆధ్వర్యంలో పర్యటించారు. ఇందులో భాగంగా 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి నేరం చేయకపోయినా బాబును జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. జైల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు అరెస్టును గవర్నర్ కూడా తప్పుపట్టారని తెలిపారు. ప్రాణానికి హాని ఉందని బాబు లేఖ కూడా రాశారని చెప్పారు. కడిగిన ముత్యంలో బయటకు రావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, ఓబుల్ రెడ్డి, కొండ సుబ్బయ్య, ఏలియా, మీనాక్షి, స్వర్ణ, ఉమాదేవి, ఇమ్రాన్, అదిల్, గౌస్, లింగాల శివశంకర్ రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌కు 'అన్నమాచార్య' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

మండలంలోని స్థానిక అన్నమాచార్య ఇంజి నీరింగ్ కళాశాల విద్యా ర్థులు సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థులు మోహన్, ప్రేమ్‌ను ఆయన అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఇ ఫైనల్ ఇయర్ చదువుతున్న మోహన్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రేమ్ ఎంపికైనట్లు వారు తెలిపారు.

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు లేక ప్రజలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరువు ప్రాంతంగా ప్రకటించాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి కూడా భవిష్యత్తులో కష్టాలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని తెలిపారు. ఇంతవరకు కరువు మండలాలుగా ప్రకటించకపోను కనీసం నిధులు కూడా కేటాయించలేదని చెప్పారు. కరువు తీవ్ర స్థాయిలో ఉన్న రాష్ట్రం నుంచి అధ్యయనం చేసేందుకు ఒక బృందం గానీ, వ్యవసాయ అధికారులు కానీ వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. కరువు తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీ కూడా సిఎం దృష్టికి తీసుకెళ్లాలనే కనీస జ్ఞానం కూడా లేదని, వీరికి ఎందుకు ఓట్లు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారు. సిఎం సొంత జిల్లాలోనే ఈ విధంగా ఉంటే, రాష్ట్రంలో పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పారు.

రేపు టిడిపి నగర విస్తృత స్థాయి సమావేశం

కడప అర్బన్ : టిడిపి నగర విస్తృతస్థాయి సమావేశం ఈనెల 29న రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి తెలిపారు. శుక్రవారం ద్వారక నగర్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి, టిడిపి నాయకులను అణిచి వేయాలని చూస్తుందని విమర్శించారు. గతంలో టిడిపి లో ఉండే నాయకులు, కార్యకర్తలు మద్దతు ఇవ్వాలని కోరారు. సైకో పాలనకు చరమగీతం పాడి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలంటే మనమందరం చేయి చేయి కలుపుకుని నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు శివ కొండారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు బియ్యం అంటూ మోసం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



నాసిరకం బియ్యాన్ని చూపుతున్న మహిళ

పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్, సుందరయ్య నగర్‌లలో నెల్లూరు బియ్యం పేరుతో పలువురి మహిళలను మోసం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి నెల్లూరు నుంచి లారీలో సన్నబియ్యాన్ని తెచ్చామని ధర తక్కువ అని నమ్మబలికి కాలనీలోని మహిళలను మోసం చేశారు. కూలీ చేసుకునే మహిళలు కావడంతో తక్కువ ధరకు వస్తున్నాయని ఆశతో చాలామంది మహిళలు బియ్యాన్ని కొన్నారు. బెల్ బ్రాండ్ పేరుతో ఉన్న సంచులు ఉండడంతో ఏమాత్రం ఆలోచించకుండా చాలా మంది మహిళలు ఒక్కో ప్యాకెట్ కు రూ.1200 ధర ఇచ్చి కొన్నారు. ఇంటికి వెళ్లి సంచులను తెరవగా అందులో నాసిరకం బియ్యము, చెక్క పురుగులు ఉండడంతో మోసపోయామని అర్థం చేసుకున్న మహిళలు, బియ్యం అమ్మిన వ్యక్తుల కోసం కాలనీ మొత్తం గాలించగా ఎక్కడ కనిపించలేదు. కూలీనాలి చేసుకొని కూడపెట్టిన డబ్బును మోసం చేసి తీసుకెళ్లడంతో బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి వసతి కల్పించాలి

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : శ్రీకృష్ణ గీతాశ్రమ ఇఒగా కొనసాగుతున్న శంకర్‌బాలాజీని గీతాశ్రమ విధుల నుంచి తొలగించి, ఆశ్రమంలో విద్యార్థులు, ప్రజలకు, మూగజీవాలకు తాగునీటి ఏర్పాటు చేయాలని పిడిఎస్‌ఒ విద్యార్థి సంఘం రాయలసీమ కన్వీనర్ ఓబులేసు డిటి మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ గీతాశ్రమానికి ఇఒగా కొనసాగుతున్న శంకర్ బాలాజీ వచ్చినప్పటి నుండి ఆశ్రమ ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయమును వినియోగించడంలో ఆయన చాలా చోట్ల చేతి వాటం చూపారని ఆరోపించారు. గీతాశ్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నామా ఎరుకలయ్య స్థాపించి అప్పటి ప్రజలకు, మూగజీవాల తాగునీటి వసతి ఏర్పాటు చేశారని అన్నారు.

సామాజిక న్యాయాన్ని గొంతు కోసే యాత్ర

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వైసిపి చేపట్టిన సామాజిక సాధికారత బస్సుయాత్ర సామాజిక న్యాయాన్ని గొంతు కోసే యాత్రని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నాపరు. శుక్రవారం స్థానిక టిబి రోడ్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎక్కడా పట్టించుకోలేదన్నారు. ఎక్కడ ఓడిపోతామో అని బాబును జైలుకు పంపించి సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టారని విమర్శించారు. అంబేద్కర్ ఎస్‌సి విద్యను జగన్ తన పేరు మీద మార్చుకొని,సెక్రటేరియట్‌లో దళితులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా ద్రోహం చేసి దళితుల కోసం బస్సు యాత్ర అనడం విడ్డూరంగా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్ గౌడ్

ఐకమత్యానికి నిదర్శనం : డిఆర్ఒ

ప్రజాశక్తి- కడప అర్బన్

'నా మట్టి నా దేశం'తో ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తిని పెంపొందించేందుకు, ఐకమత్యం సాధ్యమవుతుందని డిఆర్ఒ గంగాధర గౌడ్ అన్నారు శుక్రవారం భారత ప్రభుత్వ కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ,నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల కళాశాలలో నా మట్టి, నా దేశం అమృత్ కలశ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్ఒ మాట్లాడుతూ భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ఘనమైనవి, ఇటువంటి దేశం లో మనం పుట్టడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. జిల్లాలో అనేక ప్రదేశాలలో అమృత్ కలశ యాత్ర నిర్వహించడం సంతోషకరమన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీలోని అమృత్వాటిక స్మృతి వనంకు విజయవాడ కు బయలుదేరుతారని తెలిపారు. అనంతరం మాజీ సైనికుడు కె.వి. రావు ను సన్మానించారు. ప్రభుత్వ బాలికల కళాశాల నుంచి కోటి రెడ్డి కళాశాల వరకు అమృత్ కలశ యాత్ర ర్యాలీ విద్యార్థులు, యువత జాతీయ జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం , స్టేప్ మేనేజర్ సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీస్ షకీలా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బి వి యస్ అశోక్, సుబ్బారావు, మాలకొండయ్య , యన్. యస్. యస్. వాలంటీర్స్ ఎం. అశోక్, షేక్. అయిషా,పి.చరణ్, షేక్. సోహెబ్, ఎస్.సల్మాన్, బి.లక్ష్మీకాంత్, 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ వారి సహకారంతో జన విజ్ఞాన వేదిక ఈ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. సైన్స్ సంబరాల్లో అన్ని ప్రభుత్వ , ప్రయివేట్ ఉన్నత పాఠశాలలలో 8,9,10 వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల స్థాయి పరీక్ష నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న రాష్ట్రస్థాయి జనవరి 27,28 తేదీలలో ఉంటాయని చెప్పారు. సంబరాలలో సైన్స్ ప్రయోగాలు, వేమన పద్యాలు, మ్యాజిక్ లాంటి రకరకాల కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలుగా ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒక టీం, ప్రయివేట్ పాఠశాలల నుంచి ఒక టీం ప్రకటిస్తారని చెప్పారు. కావున అన్ని పాఠశాలల వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, బాలబయన్న, వెంకట్రమ రాజు, సరస్వతి , సునీత, కామేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, సిటి అధ్యక్షులు శివరామ్, జిల్లా కోశాధికారి సమీర్ బాషా, రాయల్ కరిముల్లా, సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు ప్రొద్దుటూరులో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పట్టణంలో వైసిపి బస్సు యాత్ర సందర్భంగా శనివారం ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి నాగరాజు ఒక ప్రటనలో పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వైవిఆర్ కల్యాణమండపం నుంచి రామేశ్వరం గాంధీరోడ్డు మీదుగా విజయకుమార్ సర్కిల్ రాజీవ్‌సర్కిల్ శివాలయం వరకు యాత్ర ఉన్నందున మధ్యాహ్నం 12.00 గంటల నుంచి బస్టాండు, గాంధీరోడ్డు వైపు, వైయంఆర్ కాలనీ నుంచి బస్టాండు వైపు వెళ్లే వారు రింగ్ రోడ్డు మీదుగా రాకపోకాలు సాగించాలన్నారు. జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే వాహనాలు పొట్టిపాడు క్రాస్‌రోడ్డు మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. మైదుకూరు నుండి వచ్చే బస్సులు కొత్తబస్టాండు మీదుగ రాకపోకాలు సాగించాలన్నారు. రాజుపాలెం నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా కొర్రపాడురోడ్డులో ఉన్న కాల్వకట్ట మల్లెలమ్మ టెంపుల్ వద్ద నుండి రాకపోకలు సాగించాలన్నారు. ఎర్రగుంట్ల నుండి వచ్చే బస్సులు వాసవి సర్కిల్ నుంచి సినీ హబ్‌ద్వార కొత్తబస్టాండు నుండి రాకపోకలు సాగించాలన్నారు. జమ్మలమడుగు వైపు నుండి వచ్చే కార్లు ,బైకులు ఎగ్జిబిషన్ పార్కింగ్,మార్కెట్‌యార్డులో ఉంచాలన్నారు. రాజుపాలెం నుంచి వచ్చేవి పాలిటెక్నిక్‌కళాశాలలో మైదుకూరు యర్రగుంట్లనుండి వచ్చేవి టూటౌన్ బైపాస్ రోడ్డులో పార్కింగ్ చేసి సహకరించాలని డిఎస్‌పి కోరారు.

న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- కడప

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదర భావం, దేశభక్తి మొదలగు అంశాల పైన కడప నగరం కాగితాల సెంటర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెమ్ముయాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీం సభ్యులు జె.సురేష్ సహాయం, నిర్మలాదేవి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

31న నెలనెలా సీమ సాహిత్యం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 31న 125వ సదస్సు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి ఒక పేర్కొన్నారు. రిటైర్డ్ ఎఇ, కడప హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీకోదండరామస్వామి ఆలయ సేవకులు దేసు వెంకటరెడ్డి సభాధ్యక్షతన నిర్వహించే సదస్సులో 'తెలుగు సాహిత్యంలో శ్రీ ఒంటిమిట్ట కోదండరామస్వామి' అనే అంశంపై రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ ప్రసంగిస్తారని తెలిపారు.

ఎపిసి కృషి అభినందనీయం

కడప అర్బన్ : సమగ్రశిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ఎపిసి ఎ.ప్రభాకర్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమగ్రశిక్ష కార్యాలయం లో వివిధ సమస్యలపై ఎపిసిని కలిసిన సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ మూడు, నాలుగు నెలలుగా సమగ్రశిక్ష పథకం కింద రాష్ట్రంలోని ఎంఇఒ ఆఫీసులు, స్కూల్ కాంప్లెక్స్‌లు, కెజిబివిలు, సహిత విద్యా కేంద్రాలు,ఉన్నత పాఠశాలలో సిఆర్‌పిలు, సిఆర్‌టిలు, ఎంఐఎస్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఇఆర్టీలు ,అకౌంటెంట్లుగా పని చేస్తున్న వారందరికీ జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, సంఘ పక్షాన ఎపిసి ఎ.ప్రభాకర్ రెడ్డిని కలిసి వారి ఇబ్బందులను గురించి చర్చించిన వెంటనే స్పందిస్తూ, ప్రత్యేక చొరవ తీసుకుని, ఎపటికపుడు వచ్చిన బడ్జెట్ కు మిగులు నిధులు జోడించి,మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా జిల్లాలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సెప్టెంబరు వరకు జీతాలు చెల్లించారని తెలిపారు. నాడు - నేడు ద్వారా పాఠశాలలకు సరఫరా చేసిన నీటిశుద్ధి యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదని, వాటిని మరమ్మతులు చేయించాలని, నిధుల కొరతతో రెండవ దశ నాడు నేడు పనులు ఆగిపోయాయని అటువంటి వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రహరీలు లేని పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలని, పాఠశాలలకు నిర్వహణా నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. స్పందించిన ఎపిసి రాష్ట్ర పథక సంచాలకుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.సుబ్బారెడ్డి,పి.ఖదీర్ బాషా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి

ప్రజాశక్తి- కడప

ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియలో భాగంగా ఈ నెల 27న జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలోని తహశీల్దార్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించామని, అభ్యంతరాలను తెలియజేయాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి డిసెంబర్ నెల 9వ తేదీ లోపు సదరు ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి, బూతు లెవెల్ అధికారి వద్ద సంబంధిత ఫారం లలో తమ వివరాలను సమర్పించాలని తెలిపారు. ఓటరు జాబితా తనిఖీ నిమిత్తం ఓటర్ నమోదు అధికారి, సహాయ ఓటర్ నమోదు అధికారి, పోలింగ్ బూత్‌ల వద్ద పని వేళల్లో తనిఖీ చేసుకునేందుకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తా : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లోనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని సున్నం బట్టీల ఏరియాలో బాబ తో నేను, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకొని తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఆరు మాసాలలో సమస్యల పరిష్కారం చేస్తానని భరోసా ఇచ్చారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో పన్నులు ఎక్కువ విధించారని, చెత్త మీద పన్ను విధిస్తున్న ఈ సైకో ప్రభుత్వాన్ని సాగనంపాలని, నియంతలా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రతి గడప తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ, మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి జయరామి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, కొండారెడ్డి, కొంగ మోహన్,రఫీ, చంద్ర, జిన్నా, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



'పైడిపాలెం' నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసినట్లు రిజర్వాయర్ డిఇ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ సామర్థ్యం ఆరు టిఎంసిలు కాగా ప్రస్తుతం ఐదు టిఎంసిల నీరు నిలువ ఉన్నాయన్నారు. డ్యామ్ నుంచి మల్లెల కాలువ, హిమకుంట్ల కాలువ, లావనూరు కాల్వకు 250 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకోవడానికి అణువుగా నీటిని విడుదల చేశామని తెలిపారు. .అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మడూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

చాపాడు : మండల పరిధిలోని మడూరులో శనివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే ఇన్‌ఛార్జి దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు భూమిపూజ

చాపాడు : మండల పరిధిలోని ఖాదరపల్లిలో రూ. 12 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపిపి టి.లక్ష్మమయ్య భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులనుంచి గ్రామంలో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి సహకారంతో గడప గడప నిధులతో సిమెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 15 గ్రామ సచివాలయాలలో సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జైనుల్లా, షఫీ, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేసినట్లు విద్యుత్ శాఖ ఎఇసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అయ్యేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి శుక్రవారం నుంచి 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యుత్తు ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిరంతర సరఫరా చేస్తామన్నారు. రైతు సోదరులు ఈ సమయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-చాపాడు

పట్టణ పరిధిలోని విఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, మంచి చెడుపై మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకటరాముడు మాట్లాడుతూ బాలికలకు 18సం, బాలురకు 22 సం వయస్సు నిండే వరకు వివాహాలు చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాల జరుగుతుంటే 1098 నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. సచివాలయ జిఎంఎస్‌కెలు కల్పన, యమున, సుబ్బమ్మ, మైథిలి మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆన్ లైన్ యాప్‌ల ద్వారా పలు సమస్యలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేఫ్ కార్యాలయ సిబ్బంది సుబ్బారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేయించాలి

సింహాద్రిపురం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని బలపనూరు రైతు భరోసా కేంద్రంలో సోషల్ ఆడిట్ టీం సభ్యులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో ఇ-క్రాప్ బుకింగ్‌లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. పంట నమోదులో విస్తీర్ణం తక్కువ, ఎక్కువ నమోదై ఉంటే రైతులు కచ్చితంగా సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు : సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా మొదలుపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిటిడి బోర్డు మెంబర్ సిద్దవటం యానాదయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాత్ర శనివారం మధ్యాహ్నం రామేశ్వరం నుంచి మొదలై వసంతపేట, గాంధీరోడ్డు, టిబిరోడ్డు మీదుగా శివాలయం ఎదురుగ చేరుకొని బహిరంగ సభ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీఎస్టీబిసి మైనార్టీలతో పాటు సామాన్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పద్మశాలీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ మత గ్రంథాల కన్న మేనిఫెస్టోను గొప్పగా భావించి ముఖ్యమంత్రి జగన్ 98శాతం పూర్తి చేశారన్నారు. ఎపి నాటక అకాడమీ అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ బిసిలంటే సమాజానికి బ్యాక్‌బోన్‌క్లాస్ అని అభివర్ణించారు. అందరం కలిసి ఎంఎల్‌ఎ రాచమల్లు ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ మురళీధర్, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంభం వెంకటేశ్వర్లు నరసింహారావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-వల్లూరు

కడప - తాడిపత్రి జాతీయ రహదారి పాపాగ్ని నది వద్ద మూడు వాహనాలు లారీ, టాటా ఏసీ, ద్విచక్ర వాహనం ఒకదానికి ఒకటి ఢీకొని సంఘటనలో ఇద్దరికీ గాయాలైనట్లు వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు కమలాపురం నుంచి కడపకు వెళ్తున్న లారీ స్పీడ్ బ్రేకర్ వద్ద వేగంగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం, దాని వెనుక వస్తున్న టాటా ఏసీ వాహనం మూడు ఢీకొన్నాయి. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడుకు కాలు విరిగింది. టాటా ఏసీ అదుపుతప్పి పల్టీ కొట్టగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొండాపురం

పట్టణం సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న జూద స్థావరంపై కొండాపురం ఎస్ఐ యోగేంద్ర తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 2400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అందరికీ అందుబాటులో వైద్యం : ఎమ్మెల్సీ



వేంపల్లె : ఆరోగ్య సురక్షను పర్యవేక్షిస్తున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

ప్రజలందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని రంగసముద్రం గ్రామపంచాయతీ రంగసముద్రం-2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష గతంలో కేవలం ప్రజల సర్టిఫికెట్ కోసమే ఉండేదని రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటి దగ్గరే ఉచిత వైద్యాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలోఎమ్మెల్యే డాక్టర్ సుధా, పంచాయతీరాజ్ జనరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు పి నాగార్జున రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తవిజయ ప్రతాపరెడ్డి, రంగసముద్రం గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాశ్ రెడ్డి, ఆప్కోస్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, ఎంపిడిఒ వరప్రసాద్, ఎంపిటిసి కలవకూరి రమణ, సచివాలయ కన్వీనర్ రమణారెడ్డి, మెడికల్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాదు వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ మార్యారెడ్డి, పాల్గొన్నారు. **వేంపల్లె :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారని కాబట్టి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ కోరారు. శుక్రవారం మండలంలోని ఇడుపులపాయ - 2 సచివాలయం పరిధిలోని కుమ్మరాంపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి, జడ్‌పిటిసి, వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి జగనన్న వైద్య సురక్ష శిబిరానికి పరిశీలి ంచారు. అలాగే వైద్య శిబిరానికి వచ్చిన రోగులను వైద్య పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్ , తహశీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామాంజనేయురెడ్డి, డాక్టర్ స్వాతి సాయి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత,అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని అందుకోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరిగుట్ట పట్టణ హెల్త్ సెంటర్‌లో జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమంలో 402 మందికి పరీక్షలు చేసి వారికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైద్యులు మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజ్, వార్డు కౌన్సిలర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్ర హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి సామాజిక బస్సు యాత్ర చేపట్టడం హాస్యాస్పదమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంద ఎలుకలను తిన్న పిల్లి కాశి యాత్ర చేసినట్లుంది వైసిపి వాలకమని ఎద్దేవ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల్లోని పేదలకు జగన్ ప్రభుత్వం అనేక విధాలుగా అన్యాయం చేసిందని చెప్పారు. అమరావతి ప్రాంతానికి చెందిన ఎస్‌పి రైతులకు బేడీలు వేసి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు జగన్ పాలనలో నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా తయారయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసర ధరలు పెంచడం ద్వారా జగన్ పాలనలో బలహీన వర్గాల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మద్యం ధరలు పెంచినందున అమ్మబడి, చేయూత, ఆసరా నిధులు నాన్న బుడ్డికే చాలడం లేదన్నారు. చాక్లెట్ ఇచ్చి నెక్లేస్ దొంగలించినట్లు ఉంది జగన్ పాలన అన్నారు. సామాజిక సాధికారత గురించి మాట్లాడే అర్హత ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. వైసిపిజనసేన, టిడిపి పార్టీలు పుట్టక ముందే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని చెప్పారు. 63 సంవత్సరాల కిందటే దళితుడైన సంజీవయ్యను ముఖ్యమంత్రిగా, ఎఐసిసి అధ్యక్షుడుగా కాంగ్రెస్ పార్టీ చేసిందని చెప్పారు. సామాజిక, సాధికారత పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి పదవినో, వైసిపి అధ్యక్ష పదవినో ఏదో ఒకటి ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

తప్పుల్లేని జాబితాను రూపొందించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వేంపల్లె

ఓటరు తన ఓటు హక్కును సజావుగా సద్వినియోగం చేసుకొనేందుకు తప్పుల తడక లేని ఓటర్ జాబితాను రూపొందించాలని పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభా మందిరంలో చక్రాయపేట, వేంపల్లె మండలాల్లోని బిఎల్ఒ, ఎన్నికల విధుల సూపర్‌వైజర్లకు ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. నూతనంగా వెలువడే ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులున్నా, మార్పులు చేర్పులున్నా డిసెంబర్ 9 లోగా అందుకు సంబంధించిన క్లైమ్‌లు బిఎల్ఒల ద్వారా సేకరించి ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దాలని కోరారు. పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాను అందరూ పరిశీలించి మార్పులు, చేర్పుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తే కొత్త జాబితాను ముద్రించు కోవడానికి వీలు ఉంటుందని చెప్పారు. అవగాహన సదస్సులో వేంపల్లె, చక్రాయపేట మండలాల తహశీల్దార్లు చంద్రశేఖర్ రెడ్డి, రాజా నరేంద్ర సింహ, ఎలక్షన్ డ్యూటి డిప్యూటీ తహశీల్దార్ జగదీష్, బిఎల్ఒలు, సూపర్‌వైజర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

పట్టణ మహిళల ప్రగతికి తోడ్పాటు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణ మహిళలకు ఆర్థికంగా కాస్త ఆసరా ఇచ్చి అండగా నిలిస్తే ప్రగతికి తోడ్పడుతారని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో స్వయం సహాయక సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అద్భుతలు సాధిస్తారని మనస్ఫూర్తిగా నమ్మిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడుగడుగునా వారిని ప్రోత్సహిస్తూనే ఉందన్నారు. స్వయం సహాయక సంఘల మహిళలకు తక్కువ వడ్డీకి రుణలు అందించి, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే దిశగా సహకరిస్తోందని చెప్పారు. జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటిన్లు అర్బన్ మార్కెట్‌లు విజయవంతం కావడంతో పట్టణ పేదరిక నిర్ములణ సంస్థ (మెప్మా)మరో ముందడుగు వేస్తుందన్నారు.మెప్మా అధ్యర్యంలో జగనన్న మార్ట్, సెల్ఫర్ పాయింట్, అర్బన్ మార్కెట్, ఆహా క్యాంటిన్, మహిళా ప్రగతి యూనిట్ ఈ పంచాసూత్రాలను మహిళాలు పాటించాలని సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు సిఎంఎం, ఎల్.గంగులయ్య, సిఒలు రసులమ్మ. ఉషారాణి,ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : విద్యుత్ సంస్థలో మూడు డిస్కమ్‌ల పరిధిలో సుమారు 4 వేల మంది విద్యుత్ మీటర్ రీడర్లుగా పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరిచాలని కోరారు. ఈ మేరకు ప్రొద్దుటూరు నుంచి కార్మికులు శుక్రవారం బైక్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అత్యంత నామ మాత్రపు వేతనాలతో పని చేస్తున్నామన్నారు. తమకు నెలవారి వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పీస్‌రేట్ తగ్గించకుండా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి బైక్‌యాత్రలు మొదలుపెట్టి విజయవాడలో ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఇ రమణను, తిరుపతిలో సిఎమ్‌డి సంతోష్‌రావును కలిసి సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పిస్తామన్నారు. అనంతరం విజయవాడకు చేరుకొని ధర్నాచౌక్‌కు చేరుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో షేక్ గఫార్ బాష, డక్కా ఓబులేసు ,బాలసుబ్బయ్య, బాబా సర్దార్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

పులివెందుల రూరల్ : పట్టణ పరిధిలోని వీరనారాయణ స్వామిఅంధుల ఆశ్రమంలో శుక్రవారం ఆశ్రమ వాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పులివెందులకు చెందిన చెంచెల సుబ్బరాయుడు 26వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు సుబ్రహ్మణ్యం, కోడలు రమ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. తమ తండ్రి సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేపడుతున్నారని సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో రమ, సుబ్రహ్మణ్యం దంపతుల కుమార్తెలు సుమతి, రేవతి, శాంతి, జ్యోతిలతోపాటు నిర్వాహకుడు రామ్మోహన్ పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో సమూల మార్పులు వచ్చాయని కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కసునూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్‌క్లినిక్‌కును పాడా ఒఎస్‌డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అయ్యాయని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సచివాలయంలోనే సంక్షేమ పథకాలు పొందేలా రూపకల్పన చేశామన్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, ఉపాధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎంపిపి అరుణ, ఎంపిడిఒ కృష్ణమూర్తి, పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఇఇ రాజశేఖర్, హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వాములైన 3,225 మంది పాడి రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిందని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న అర్హులైన పాడి రైతులకు ఒక లీటరుకు 50 పైసల వంతున నగదు ప్రోత్సాహకాన్ని రైతుల ఖాతాలకు విడుదల చేసినట్లు తెలిపారు. పాల డెయిరీలను బలోపేతం చేసే లక్ష్యంతో జాతీయ స్థాయిలో పేరుగాంచిన అమూల్‌తో కలిసి ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో జగనన్న పాలవెల్లువ పథకానికి శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంతో పాటు వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాలలోని రైతులు లబ్ధి పొందారని చెప్పారు. చక్రాయపేట 811 మందికి గాను రూ. 9.11 లక్షలు, లింగాల 743 మందికి గాను రూ. 4.19 లక్షలు, సింహాద్రిపురం 470 మందికి గాను రూ. 2.52 లక్షలు, పులివెందుల 273 మందికి గాను రూ. 1.34 లక్షలు, తొండూరు 262 మందికి గాను రూ. 1.36 లక్షలు, వేంపల్లె 179 మందికి గాను రూ. 99 వేలు, వేముల 377 మందికి గాను రూ. 1.94 లక్షలు, వీరపనాయన పల్లి 40 మందికి గాను రూ. 6 వేలు,పెండ్లిమర్రి 70 మందికి గాను రూ. 17 వేలు, మొత్తం 9 మండలాలు కలిపి 3,225 మంది అర్హత కలిగిన పాడి రైతులకు సుమారు 21 లక్షలా 70 వేలా 62 రూపాయలను కానుకగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఏడాదికి 180 రోజులు అమూల్ కేంద్రాలకు పాలు పోసిన వారు ఇందుకు అర్హులన్నారు. జగనన్న పాలవెల్లువ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచు కోవాలన్నారు.

రాష్ట్రీయ బ్రహ్మ సేన వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా మాధవాచారి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రాష్ట్రీయ బ్రహ్మసేన వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా పొట్టి పాటి మాధవాచారి నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన నియామక పత్రాలను గురూజీ డాక్టర్ కృష్ణమాచార్యుల నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా పులివెందులలో ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు ఆధ్యాత్మిక భావాలు ఎంతో అవసరం అన్నారు. నేటి యువత కూడా సన్మార్గంలో నడవడానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఎంతో దోహదపడతాయన్నారు. యోగ, ధ్యానం, వ్యాయామంతో పాటు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకుంటే సమాజం పురోభివృద్ధి చెందుతుందన్నారు తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన గురుతర బాధ్యతను పూర్తి స్థాయిలో నెర వేర్చేందుకు కృషి చేస్తాన న్నారు. పదవి అప్పగి ంచిన కాలజ్ఞాని పో తులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి ఉపాస కులు బ్రహ్మ పదం డాక్టర్ కృష్ణమాచార్య వారికి తెజేసు కుంటు న్నానన్నారు. బాధ్యతను శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు